
# నేడు 'ఖని'కి గులాబీ బాస్

- రామగుండం ప్రజా ఆశీర్వాద సభకు హాజరుకానున్న అధినేత కేసీఆర్
- జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు

పెద్దపల్లి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు రామగుండానికి వస్తున్నారు. గత నెల 15న హుస్నాబాద్ వేదికగా ప్రజా ఆశీర్వాద సభలకు శ్రీకారం చుట్టిన ఆయన, అప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పద మూడు నియోజకవర్గాలకు గాను పది సభలు పూర్తి చేశారు. మొదటగా గత నెల 15న హుస్నాబాద్, 17న సిరిసిల్ల,



గోదావరిఖనిలో సీఎం కేసీఆర్ సభ కోసం సిద్ధమైన వేదిక


ఈ నెల 2న ధర్మపురి, 3న కోరుట్ల, 7న మంథని, పెద్దపల్లి, 17న ఒకే రోజు కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత సోమవారం (ఈ నెల 20) మానకొండూర్ సభకు హాజరైన గులాబీ బాస్, శుక్రవారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రామగుండం ప్రజా ఆశీర్వాసభకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీ ప్యాడ్ నుంచి సభా స్థలికి ఐదు నిమిషాల్లో చేరుకొని తిరిగి వెళ్లిపోయేలా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఎలాంటి సంఘటలు చోటు చేసుకోకుండా రామగుండం సీపీ రమా రాజేశ్వరి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

### భారీ జన సమీకరణకు ఏర్పాట్లు

ప్రజా ఆశీర్వాద సభకు రామగుండం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదిక, కమీషనరేట్ ఆవరణలోని హెలిప్యాడ్‌ను ఆయన పరిశీలించి, సూచనలు చేశారు. అలాగే నియోజకవర్గంలోని రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లు, అంతర్గాం, పాలకుర్తి మండలాలు, రామగుండం అర్బన్ మండలం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నారు. స్టేడియంలో షామియానాలు, వేలాది మంది కూర్చునేందుకు వీలుగా కుర్చీలు వేస్తున్నారు. వాటర్ ప్యాకెట్లు కూడా తెప్పిస్తున్నారు. అంబులెన్స్‌లు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచుతున్నారు. రామగుండం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ప్రగతి పదాత కేసీఆర్‌కు మనమంతా కృతజ్ఞతగా ఉండాలని, పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ప్రజా ఆశీర్వాసభకు సింగరేణి కార్మికులు వేలాదిగా తరలిరావాలని టీబీజీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య కోరారు.

### ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, నవంబర్ 23: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం జరగనున్న సీఎం కేసీఆర్ భరోసా ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను రామగుండం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల, సబ్ రిజిస్టర్, సీనియర్ సివిల్ కోర్టు, భవన కార్యాలయంతో పాటు రామగుండం అభివృద్ధి ఎంతగానో సహకరించిన అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌కు ప్రజలు అఖండ స్వాగతం పలికాలని కోరారు. ఈ భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో మరిన్నీ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టనున్న సీఎం కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఆయన వెంట రామగుండం ఎన్నికల ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, సీనియర్ నాయకుడు కౌశికహరి, మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేకర్ రావు పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్

కొత్తపల్లి, నవంబర్ 23: హైదరాబాద్‌లో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగే 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–14 బాలబాలికల స్విమ్మింగ్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి రమీజ్ ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన రమీజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రమీజ్‌ను మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు మహేందర్, జహేద, ఉపాధ్యాయులు అభినందించారు.

# పోస్టల్ ఓట్లు వేసేందుకు బారులు

- రోజుకు వందల సంఖ్యలో ఉద్యోగుల ఓటింగ్
- ఫలిస్తున్న ఎన్నికల సంఘం కృషి
- ఈనెల 27 వరకు పోస్టల్ ఓటుకు అవకాశం

కలెక్టరేట్, నవంబర్ 23: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనే సంకల్పంతో ఎన్నికల సంఘం చేస్తున్న కృషి ఫలిస్తోంది. వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా ఈసీ చేపట్టిన అనేక రకాల చైతన్య కార్యక్రమాలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయి. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్, ఎస్సెన్సియల్ సెక్టార్లతో పాటు ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు ఈసారి శాసనసభ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు పోటీ పడుతున్నారు. వీరి కోసం శిక్షణ శిబిరాల సమీపంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓట్లు వేసేందుకు బారులు తీరుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం జిల్లా వ్యాప్తంగా గురువారం వరకు 7వేల పైచిలుకు దరఖాస్తులు రాగా, వీటిలో 4,500 పైచిలుకు జిల్లాలోని ఉద్యోగులవి కాగా, 2,400 జిల్లాలో ఉంటూ ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారివి. జిల్లాలో 4,872 మందికి ఎన్నికల విధులు కేటాయించగా, వీరితో పాటు ఇతర అత్యవసర విభాగాల్లో విధులు నిర్వహించే వారు కూడా ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారానే వినియోగించుకుంటున్నారు. ఈనెల 20 నుంచి పోస్టల్ ఓట్ల ప్రక్రియ ప్రారంభం కాగా, ముగింపు గడువు సమీపిస్తున్న క్రమంలో రోజురోజుకు పోస్టల్ ఓట్ల సంఖ్య పెరుగుతుంది. ఒక్కో సెగ్మెంట్ పరిధిలో 300కు పైగా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లు వేస్తున్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. గురువారం కరీంనగర్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉద్యోగులు వందల సంఖ్యలో బారులు తీరారు. వీరంతా రెండు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు కూడా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉద్యోగులు ఆర్‌వో కార్యాలయానికి రావడం కనిపించింది. పోస్టల్ ఓట్లు వేసే విధానం కూడా ఈసారి ఎన్నికల కమిషన్ మార్చింది. గతంలో పంపిణీ కేంద్రాలతో పాటు పోలింగ్ విధులు నిర్వహించే కేంద్రంలో కూడా పోస్టల్ ఓటు వేసే అవకాశముండేది. అయితే, ఈసారి మాత్రం అలా కాకుండా పోలింగ్ విధుల నిర్వహణలో అవగాహన కల్పించే శిక్షణ ఇచ్చిన అనంతరం పక్కనే ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆదేశాలను జారీ చేసింది. దీంతో జిల్లా ఎన్నికల అధికారులు శిక్షణ శిబిరం ముగియగానే, పోస్టల్ ఓటు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈవిధానంతో పోస్టల్ ఓటర్లు నేరుగా తమ ఓట్లను బ్యాలెట్ బాక్సులో వేసే అవకాశం ఉంటుంది. జిల్లాలోని 1,338 పోలింగ్ కేంద్రాల్లో 4,872 మంది ఉద్యోగులు ఎన్నికల విధు లు నిర్వహించనుండగా, కరీంనగర్ సెగ్మెంట్ పరిధిలోని 390 పోలింగ్ కేంద్రాల్లో 1,716 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది, చొప్పదండిలోని 327సెంటర్లలో 784 మంది, మానకొండూర్‌లోని 316 కేంద్రాల్లో 952 మంది, హుజూరాబాద్‌లోని 305 కేంద్రాల్లో 1,056 మంది, హుస్నాబాద్ సెగ్మెంట్ పరిధిలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 364 మంది సిబ్బందిని కేటాయించారు. వీరంతా వారి వారి అసెంబ్లీ సెగ్మెంట్లలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో పోస్టల్ వోటు వినియోగించుకుంటున్నారు. గతంలో నామమాత్రంగానే పోలయ్యే పోస్టల్ ఓట్లు, ఈసారి అత్యధిక సంఖ్యలో నమోదవుతున్నాయి.



పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

## ప్రభుత్వ దవాఖానలో అరుదైన శస్త్ర చికిత్స

- మూడున్నర కిలోల కణతి తొలగింపు

విద్యానగర్, నవంబర్ 23: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో వైద్యులు గురువారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. కడుపునొప్పితో బాధపడుతూ రక్తస్రావం అవుతున్న ఓ మహిళ కడుపులోంచి మూడున్నర కిలోల కణతిని తొలగించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంకాడిపల్లికి చెందిన లక్ష్మి కడుపు నొప్పితో, రక్త స్రావంతో బాధపడుతూ ఈనెల ఒకటిన దవాఖానలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు కడుపులో కణతి ఉందని గుర్తించారు. లక్ష్మి హైబీపీతో పాటు థైరాయిడ్, రక్త హీనతతో బాధపడుతున్నది. వీటన్నింటిని నార్మల్ చేశారు. గురువారం గైనకాలజిస్టు నిఖత్ పర్వీన్, అనస్థిషియా రాజశ్రీ, సిస్టర్ సృజన, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ మంజులను సూపరింటెండెంట్ శీల లక్ష్మీనారాయణ, దవాఖాన సూపరింటెండెంట్లు డాక్టర్ కృష్ణ ప్రసాద్, వీరారెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ జ్యోతి, అదనపు ఆర్‌ఎంవో డాక్టర్ నవీన అభినందించారు.



మూడున్నర కిలోల కణితిని తొలిగించిన వైద్యులు

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461
CHANGE OF NAME
★ I, Ure Mounika, D/o. Ure Narsaiah, H.No. 5-100/3, Vill: Laxmidevipalli, Mdl: Sarangapur, Dist. Jagtial. T.S. changed my name as SHANIGARAPU LAHARI W/o. SHANIGARAPU NAGARAJU.
NTK-316855
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194